సంగారెడ్డి
నమస్తే తెలంగాణ
బుధవారం 26 జూన్ 2024
WEDNESDAY, JUNE 26, 2024

కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే



మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, జూన్ 25: నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి మంగళవారం మాజీ సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎర్రవల్లిలోని వ్యవసాయక్షేత్రంలో మాజీ సీఎంను కలిసి పలు అంశాలపై చర్చించుకున్నారు. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో కార్యకర్తలెవరూ అధైర్యపడొద్దని, బీఆర్ఎస్‌కు తిరిగి పూర్వవైభవం వస్తుందని కేసీఆర్ పేర్కొన్నట్లు మాజీ ఎమ్మెల్యే తెలిపారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులను సైతం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు విఠల్‌రావు, జగదీశ్వర్‌చారి, దస్తగిర్ ఉన్నారు.

ప్రజలకు వారధిగా పనిచేయాలి

ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట, జూన్ 25: ప్రజల అవసరాలు తీర్చడానికి వారిధిగా పనిచేయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఎంపీటీసీలకు సూచించారు. మంగళవారం మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో ఎంపీపీ తొంట యాదమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే నెల 4వ తేదీన ఎంపీటీసీల పదవీకాలం ముగుస్తున్నందున భవిష్యత్తులో ప్రజలకు మరింత చేరువ కావాలన్నారు. ఇప్పటి వరకు ప్రజలకు అందుబాటులో ఉండి పూర్తి స్థాయిలో సేవలందించారని అభినందించారు. వర్షాకాలం దృష్ట్యా ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులోనూ తన సంపూర్ణ సహకారం ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంపీపీ, ఎంపీటీసీలను ఎమ్మెల్యే శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మి, ఏవో అనిత, ఎంఈవో శంకర్, హార్టికల్చర్ స్పందన, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు త్రినేత్ర ఏజెన్సీ సన్మానం

సంగారెడ్డి, జూన్ 25: త్రినేత్ర ఏజెన్సీ నిర్వాహకులు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు శాలువా కప్పి సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, త్రినేత్ర మార్కెటింగ్ ఏజెన్సీ వైర్మన్ ప్రకాశ్, డైరెక్టర్ మహేశ్‌కుమార్, శ్రీకాంత్ అంబేద్కర్ యూత్ నవీన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్

జెడ్పీ ఉపేందర్‌రెడ్డికి మొక్కను అందజేస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

రామచంద్రాపురం, జూన్ 25: జోనల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉపేందర్‌రెడ్డిని ఆర్సీపురం డివిజన్ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డివిజన్‌లో ఉన్న సమస్యలను జెడ్సీకి కార్పొరేటర్ వివరించారు. డివిజన్‌లోని సండే మార్కెట్ బస్సు రూట్‌లో మిగిలి ఉన్న సీసీ రోడ్డు పనులు, హిందూ శ్మశానవాటిక అభివృద్ధితో పాటు కాలనీల్లో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని జోనల్ కమిషనర్‌ను కార్పొరేటర్ కోరారు.

102, 108 వాహనాల తనిఖీ

అందోల్, జూన్ 25: జోగిపేట ప్రభుత్వ దవాఖానలోని 102, 108 వాహనాలను సోమవారం తనిఖీ చేసి వాహనాల పనితీరు, సౌకర్యాలను పరిశీలించినట్లు జీవీకే ప్రాజెక్ట్ అధికారి జనార్దన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉచితంగా సేవలు అందించడంలో 102, 108 సేవలు మరువలేనివన్నారు. రోజువారీగా తరలించే క్షతగాత్రుల వివరాలు, గర్భిణులు, బాలింతల వివరాలు సేకరించారు. వాహనాలను కండిషన్‌లో ఉంచాలని.. ఆక్సిజన్ ఇతర పరికరాలు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పైలెట్లు కృష్ణమూర్తి, సాయిబాబా ఉన్నారు.

యూనిఫాం పంపిణీ

హత్నూర, జూన్ 25: మండలంలోని గుండ్లమచునూర్, బొక్కలగూడెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు హానర్ పరిశ్రమ యాజమాన్యం మంగళవారం స్కూల్ యూనిఫాం, నోట్‌బుక్స్ పంపిణీ చేసింది. విద్యార్థుల తల్లిదండ్రులు పరిశ్రమ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. హెచ్‌ఆర్ మేనేజర్ సుభాష్‌రెడ్డి, పంచాయతీ మాజీ కోఆప్షన్‌సభ్యుడు శ్రీహరి, నాయకులు శ్రీశైలం, అశోక్, నర్సింగరాజ్ పాల్గొన్నారు.

గ్రామకంఠం స్థలాన్ని కాపాడాలని వినతి

జిన్నారం, జూన్ 25: జిన్నారం పంచాయతీ పెద్దమ్మగూడెంలో సాంప్రదాయ పండుగను జరుపుకునే స్థలాన్ని అక్రమంగా కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టిన వ్యక్తి నుంచి స్థలాన్ని కాపాడాలని గ్రామస్తులు కలెక్టరేట్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. 50 సంవత్సరాలుగా దసరా, బతుకమ్మ, బోగి తదితర పండుగలను ఇక్కడే జరుపుకుంటామని తెలిపారు. అలాంటి స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంటి నిర్మాణానికి అనుమతిచ్చిన గ్రామ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సమయానికి పింఛన్ అందించాలి

వట్‌పల్లి, జూన్ 25: సమాయనికి పింఛన్ రాక ఇంబ్బదులు పడుతున్నామని దివ్యాంగుల డివిజన్ అధ్యక్షుడు సుభాష్ అన్నారు. మండలంలోని దివ్యాంగులు, వృద్ధులకు సమాయానికి పింఛన్ అందించాలని మండలంలోని ఎంపీడీవో శశిప్రభకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెలా 5వ తేదీలోగా పింఛన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో యూసుఫ్, దివ్యాంగుల మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు ఖలీల్ మీయ, బాబు, అబేద్, రషియా పాల్గొన్నారు.

రైతుకు ఏదీ 'భరోసా'

- కందిలో అధికారులు లేక వెనుతిరిగిన రైతులు
- జిల్లాలోని పలు రైతువేదికల్లో ఎలాంటి సమావేశాలు లేని వైనం

కంది/గుమ్మడిదల/జిన్నారం/రాయికోడ్/నిజాంపేట్/అందోల్, జూన్ 25: సమస్యలు విన్నవించేందుకు రైతు వేదికల వద్ద రైతులు పడిగాపులు కాశారు. సమస్యలు చెప్పుకునేందుకు కంది మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రైతులు మంగళవారం కంది రైతు వేదిక వద్దకు వచ్చారు. రైతు భరోసా విధానాలు, కొత్త నింబంధనలపై అభి ప్రాయాలను తెలిపేందుకు సమావేశం నిర్వహి స్తారని తెలిసి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎదురు చూశారు. అధికారులు రాకపోవడంతో అసహనంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. పటాన్‌చెరు నియోజకవర్గం జిన్నారం మండలంలోని సోల్కంపల్లి రైతు వేదికలో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహిస్తే కొంతమంది రైతులు మాత్రమే పాల్గొన్నారు. రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించామని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. జిల్లాలోని పలు గ్రామాల్లోని రైతు వేదికల్లో ఎలాంటి సమావేశాలు జరుగకపోవడం గమనార్హం.

కంది: మధ్యాహ్నం వరకు ఎదురుచూసి తిరిగి వెళ్లిపోతున్న రైతులు



రాయికోడ్: వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు, అధికారులు



జిన్నారం: సోలక్‌పల్లి రైతు వేదిక నుంచి వీడియోకాన్ఫరెన్స్

అందోల్: డాకూర్ రైతువేదికలో..

జాగిలాల పనితీరుపై ఆరా

సంగారెడ్డి, జూన్ 25: జిల్లాలో గంజాయి, నార్కొటిక్ డ్రగ్, ఓపీఎం, అల్ఫాజోలం వంటి మాదకద్రవ్యాలను గుర్తించేందుకు జాగిలాల సేవలు అవసరమని, వాటితో మత్తు పదార్థాలను పట్టుకునే అవకాశం ఉంటుందని ఎస్పీ చెన్నూరి రూపేశ్ తెలిపారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో డాగ్ స్క్వాడ్‌ను సందర్శించి జాగిలాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల మూలాలు లేకుండా చేయడానికి జిల్లా పోలీసు యంత్రాంగం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. గంజాయి, అల్ఫాజోలం వంటి మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కాకుండా చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో జాగిలాల సేవలతో మత్తును నామ రూపాల్లేకుండా చేయడం పోలీసుల లక్ష్యమన్నారు. అనంతరం డాగ్ హ్యాండ్లర్స్ విశ్వనాథం, మొగులయ్య, జగదీశ్వర్, అంజయ్యలతో జాగిలాలకు శిక్షణపై క్రమశిక్షణతో ఉండాలన్నారు. ముఖ్యంగా మాదక ద్రవ్యాల అచూకీని గుర్తించేలా తయారు చేయాలని ఎస్పీ సిబ్బందికి సూచించారు.

జాగిలాల శిక్షణపై డాగ్ హ్యాండ్లర్స్‌తో మాట్లాడుతున్న ఎస్పీ రూపేశ్

పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి

జిన్నారం, జూన్ 25: ఆరోగ్యాలను హరిస్తున్న పరిశ్రమలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రముఖ న్యాయవాది, పర్యావరణ వేత్త దండె రమాకాంత్ అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరారు. మంగళవారం ఖాజీపల్లి గ్రామస్తులతో కలిసి ఎంపీపీ రవీందర్ గౌడ్, ఎంపీడీవో అరుణ, గ్రామ ఈవో శ్రీనివాస్‌రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖాజీపల్లి గ్రామ పరిధిలో ప్రమాదకరమైన రసాయన పరిశ్రమలతో గ్రామస్తుల ఆరోగ్యాలు క్షీణిస్తున్నాయని, ప్రతి ఒక్కరూ ఆరోగ్య సమస్యకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇక్కడ హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలని కోరారు. త్వరలోనే కలెక్టర్‌కు, ఎన్జీటీ, సుప్రీంకోర్టులను ఆశ్రయిస్తామని చెప్పారు. మా పోరాటానికి సినీ హీరో ప్రభాస్ కూడా మద్దతు తెలిపారని చెప్పారు. కార్యక్రమంలో కుమార్‌యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

హామీల అమలు మరిచిన కాంగ్రెస్

కోహీర్, జూన్ 25: అమలు కాని హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నామ రవికిరణ్ గుప్తా, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు మోహన్, పట్టణ మాజీ అధ్యక్షుడు యాకూబ్ ఆరోపించారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో గెలిచిన వెంటనే పింఛన్లను పెంచుతామని చెప్పి ఇప్పుడు ముఖం చాటేసిందన్నారు. వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6వేలు ఇస్తామని వారిని మోసం చేసిందన్నారు. 200 రోజులు గడిచినా ఇంత వరకు పింఛన్ల పెంపుపై నిర్ణయం ప్రకటించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీలపై శ్రద్ధ పెట్టకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవడంపైనే దృష్టిపెట్టారని మండిపడ్డారు. పింఛన్లు సకాలంలో అందించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు శివన్న, శ్రీకాంత్, నరేశ్‌రెడ్డి, విజయ్ ఉన్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సమస్యలు పరిష్కరిస్తా..

బొల్లారం, జూన్ 25: మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డు బీసీ కాలనీలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని బీఆర్ఎస్ నాయకులు, మాజీ జడ్పీటీసీ కోలన్ బాల్‌రెడ్డి కాలనీవాసులకు భరోసా కల్పించారు. మంగళవారం నాయకులు బాల్‌రెడ్డి బీసీ కాలనీలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. డ్రైనేజీ, విద్యుత్ స్తంభాలు, నీటి సమస్యలతో సతమతమవుతున్నట్లు కాలనీవాసులు వివరించారు. కాలనీ సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం అందిస్తానని బాల్‌రెడ్డి స్థానికులకు హామీ ఇచ్చారు. కౌన్సిలర్ బీరప్ప యాదవ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి

పటాన్‌చెరు, జూన్ 25: తల్లిదండ్రుల కలలను సాకారం చేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని బీహెచ్ఈఎల్ సేఫ్టీ రిటైర్డ్ ఆఫీసర్, జిల్లా ఉత్తమ సంఘ సేవకుడు అవార్డు గ్రహిత ఖాదర్ మొహీయుద్దీన్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యం పెట్టుకొని చదవాలని సూచించారు. నిత్య జీవితంలో క్రమశిక్షణ ఎంతో అవసరం అన్నారు. భద్రత కూడా జీవితంలో ఎంతో ముఖ్యమని, రోడ్డు దాటే సమయంలో రెండు వైపుల చూసి దాటాలన్నారు. ప్రమాదాలు, భద్రత చర్యలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ భావన్‌రాజ్, రాజు, అలివేలు, హఫీజ, నాగలక్ష్మి, ఏజాజ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఖాదర్ మొహీయుద్దీన్

మొక్కల సంరక్షణ కార్యదర్శులదే..

సంగారెడ్డి, జూన్ 25: వన మహోత్సవం, ఉపాధిహామీ పథకంలో నాటిన మొక్కల సంరక్షణ బాధ్యత పంచాయతీ కార్యదర్శుల దేనని, నిర్లక్ష్యం చేస్తే సహించేదిలేదని ఏపీడీ జంగారెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని కులబ్‌గూర్ గ్రామంలో ఎండిపోయిన నక్షత్ర వనంపై నమస్తే తెలంగాణ దినపత్రికలో వచ్చిన కథనం తెలిసిందే. ఈ కథనంపై అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ సంబంధిత కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని, మళ్లీ మొక్కలు నాటించే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఏపీడీ జంగారెడ్డి, ఎంపీడీఓ యాదవరెడ్డి, ఏపీఓ, ఉపాధిహామీ సిబ్బందితో కలిసి నక్షత్రవనాన్ని పరిశీలించారు. నక్షత్రవనంలో సిబ్బంది, కూలీలతో మొక్కలు నాటేందుకు గుంతలు తీయిస్తున్నారు. గుంతలు తీసే పనుల్లో దాదాపు 30 మంది ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

నక్షత్రవనంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

గతంలో నాటిన మొక్కల రకాలకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందిని పీడీ ఆదేశించారు. నక్షత్రాలు, రాశులను తెలిపేవిధంగా 112 రకాల మొక్కలను తీసుకువచ్చి నాటేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నక్షత్రవనం పూర్తవైభవం సంతరించుకునేలా మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని కార్యదర్శికి సూచించారు. అందుబాటులో లేకుంటే ఇతర ప్రాంతాల నుంచి మొక్కలను తీసుకువచ్చి నాటాలన్నారు.

బొంతపల్లిలో రసాభసగా గ్రామసభ

గుమ్మడిదల, జూన్ 25: ప్రత్యేక అధికారుల పాలనలో పాలన పడకేసిందని గ్రామస్తులు గ్రామసభలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రియాల్టర్లు వెంచర్ల పేరుతో ఫాంలాండ్లను ఏర్పాటు చేసి గుంటలుగా విక్రయిస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. మంగళవారం మండలంలోని బొంతపల్లి పంచాయతీ భవనంలో ప్రత్యేక అధికారి, ఎంపీడీవో ఉమాదేవి, ఎంపీవో దయాకర్‌రావు, జీపీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామానికి చెందిన నాయకుడు సురభికుమార్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామంలోని 270 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్నా అధికారులు చర్యలు ఎందుకు తీసుకుంటలేరో తెలుపాలని అధికారులను కోరారు. న్యూలాండ్ పరిశ్రమ, డంపింగ్‌యార్డు శివారులో ఉన్న ప్రభుత్వ భూమిలో ప్రైవేటు వ్యక్తులు ప్రహరీ నిర్మించారన్నారు. ఎంపీటీసీ నాగేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో మౌలికవసతుల కల్పనలో ప్రత్యేక పాలన విఫలమైనదని ఆరోపించారు. ఎంపీడీవో వివరణ ఇస్తూ ప్రభుత్వ భూములను రక్షించడానికి రెవెన్యూ శాఖ ఏడీఈతో సర్వే చేయిస్తామన్నారు. బీజేపీ స్టేట్ కౌన్సిల్ గిద్దె రాజు, గ్యారల మల్లేశ్, సుంకరి శంకర్, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో అధికారుల తనిఖీ

పటాన్‌చెరు, జూన్ 25: తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం చిట్కుల్‌లో ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం పటాన్‌చెరు మండలం చిట్కుల్, ఇస్నాపూర్ చౌరస్తాలోని ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్లను ఎఫ్ఎస్ఎస్ఏఐ, మొబైల్ ప్రయోగశాల (ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్) అధికారుల్లో విస్తూపోయే నిజాలు బయటపడ్డాయి. చిట్కుల్ వసతి గృహంలో గడువు తేదీ లేని మరమరాలు, ఎండు కొబ్బరి ప్యాకెట్లు గుర్తించారు. గసగసాలులో లక్క పురుగులు బయటపడ్డాయి. అపరిశుభ్రత, నాణ్యత లేని పదార్థాల కంటైనర్లను గుర్తించారు. ఇస్నాపూర్ చౌరస్తాలోని శ్రీరామ్ లగ్జరీ పురుషుల ప్రైవేట్ హాస్టల్‌కు లైసెన్స్ లేదని తెలిపారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం

అందోల్, జూన్ 25: అందోల్-జోగిపేట మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మంగళవారం కౌన్సిలర్ నాగరాజుతో కలిసి కమిషనర్ తిరుపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నాగరాజు మాట్లాడుతూ 14వ ప్రణాళిక సంఘం నిధుల నుంచి రూ.8 లక్షలు వెచ్చించి డ్రైనేజీ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. 12వ వార్డును మున్సిపాలిటీలోనే ఆదర్శ వార్డుగా తీర్చి దిద్దుతానని ప్రజలు అందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శరత్‌బాబు, తదితరులు ఉన్నారు.

నేటి నుంచి డిగ్రీ తరగతులు ప్రారంభం

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 25: డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 26 నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు స్థానిక తారా ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు బీఏ, బీబీఏ, బీకాం విద్యార్థులకు, మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు బీఎస్సీ తరగతులు జరుగుతాయని వివరించారు. అయితే విద్యార్థులు యూనిఫామ్, ఐడెంటీకార్డుతో తరగతులకు హాజరుకావాలని సూచించారు. విద్యార్థులకు 70 శాతం హాజరు ఉండాలని, లేని పక్షంలో వార్షిక పరీక్షలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించి విధిగా తరగతులకు హాజరు కావాలని కోరారు.

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 25: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించాలని స్థానిక సేయింట్ పీటర్స్, సేయింట్ ఆంథోనీస్ పాఠశాలల చైర్మన్ ఈధర ఆంథోనీరెడ్డి అన్నారు. ఇటీవల సేయింట్ పీటర్స్ పాఠశాలలో నిర్వహించిన విద్యార్థి ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం బాధ్యతలను అప్పగించారు. కొత్తగా ఎన్నికైన విద్యార్థులు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ రవికుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భారీగా గుట్కా స్వాధీనం

బొల్లారం, జూన్ 25: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని జ్యోతి నగర్‌లో రూ.8లక్షల విలువైన నిషేధిత గుట్కాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం సాయంత్రం జ్యోతి నగర్‌లోని దత్తు అనే వ్యాపారి దుకాణంలో తనిఖీలు చేయగా 20 సంచుల నిషేధిత గుట్కా లభ్యమైంది. నిందితుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... నిషేధిత పొగాకు, గుట్కాలు నిల్వ చేసినా, విక్రయించిన, రవాణా చేసినా నేరమన్నారు. ఎస్సై దశరథ్, ఏఎస్ఐ నారాయణ, హెడ్ కానిస్టేబుళ్లు మల్లేశం, సంజీవ్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

సిద్ధివినాయక ఆలయం.. భక్తజన సంద్రం

- వైభవంగా అంగరక సంకష్టహర చతుర్థి
- స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

భక్తులతో కిక్కిరిపోయిన రేజింతల్ సిద్ధివినాయక ఆలయ ప్రాంగణం

న్యాల్‌కల్, జూన్ 25: రేజింతల్ సిద్ధివినాయక ఆలయం భక్తజన సంద్రమైంది. అంగారక సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని మంగళవారం ఆలయంలో వేదపండితులు స్వామివారికి అభిషేకం, కుంకుమార్చన, యాగం, హారతి తదితర పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనానికి కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు కలినడకన తరలిరావడంతో జహీరాబాద్, బీదర్, అల్లాదుర్గం వెళ్లే రోడ్లు కిక్కిరిసిపోయాయి. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బారికేడ్లలో భక్తులు గంటల తరబడి నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి పల్లకీ సేవ నిర్వహించారు. మహారాష్ట్రకు చెందిన భక్తుల భజన కీర్తనాలు ఆట్టుకున్నాయి. భక్తుల సౌకర్యార్థం జహీరాబాద్, బీదర్ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడిపించారు. డీఎస్పీ రామోహ్మన్‌రెడ్డి ఆధ్వర్యంలో జహీరాబాద్ సీఐ నయీమొద్దీన్, హద్నూర్ ఎస్ఐ రామానాయుడు బందోబస్తు ఏర్పాటు చేశారు. మిర్జాపూర్(బి) ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు నరేందర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి, ఎస్పీ చెన్నూరి రూపేశ్, ఆలయ ధర్మాధికారి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. మండలంలోని హద్నూర్, చీకూర్తి గ్రామాల్లోని సిద్ధి, వరసిద్ధి వినాయక ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు అల్లాడి వీరేశం,ఆలయ కమిటీ అధ్యక్షుడు రేజింతల్ అశోక్, ప్రధాన కార్యదర్శి అల్లాడి నర్సింహులు, కమిటీ సభ్యులు రమేశ్, రాజేశ్వర్, ఉల్లిగడ్డ బస్వరాజ్, చిద్రి లక్ష్మణ్, దిగంబర్ పోలా, కోబ్బజీ రవికుమార్, కల్వ చంద్రశేఖర్, మేనేజర్ కృష్ణ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయానికి గండి

రేజింతల్ సిద్ధివినాయక ఆలయం ఎదుట కర్ణాటక బస్సులు

న్యాల్‌కల్, జూన్ 25: తెలంగాణ ఆర్టీసీ ఆదాయానికి కర్ణాటక ఆర్టీసీ గండి కొట్టింది. సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని రేజింతల్ సిద్ధివినాయక ఆలయానికి కర్ణాటక ప్రాంతం నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దీని కోసం కర్ణాటక బీదర్ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపింది. భక్తులు వేల సంఖ్యలో వస్తారని తెలిసినా తెలంగాణ నుంచి ప్రత్యేక బస్సులు వేయకపోవడంతో ఆర్టీసీకి ఆదాయానికి గండి పడింది. రేజింతల్ సిద్ధి వినాయక ఆలయం జహీరాబాద్, నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోల పరిధిలో ఉంటుంది. తెలంగాణ ఆర్టీసీ అధికారులు రోజు మాదిరిగానే బీదర్-హైదరాబాద్, నారాయణఖేడ్-జహీరాబాద్ రూట్లలో నడిపే బస్సులను మాత్రమే తిప్పారు. కర్ణాటక బీదర్ డిపో నుంచి ప్రత్యేకంగా 30కి పైగా బస్సులను నడిపింది. మంగళవారం తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు బీదర్ ఆర్టీసీ అధికారులు ఆలయం నుంచి ప్రత్యేక బస్సుల్లో భక్తులను తరలించారు. జహీరాబాద్, నారాయణఖేడ్ డిపో అధికారులు మాత్రం ఎక్కడా కనిపించలేదు. ఆయా డిపోల అధికారుల నిర్లక్ష్యంతో తెలంగాణ ఆర్టీసీకి రావాల్సిన ఆదాయాన్ని కర్ణాటక ఆర్టీసీ గండి కొట్టిందని భక్తులు ఆరోపించారు.

మురుగు నిలిచేలా డ్రైనేజీపై మెట్ల నిర్మాణం

అధికారులు హెచ్చరించినా వినని వైనం

మునిపల్లి, జూన్ 25: మండలంలోని చిన్నాచెల్మడ గ్రామానికి చెందిన మంగళి దశరత్ తన ఇంటికి సంబంధించి సీసీ రోడ్డుకు ఆనుకొని ఉన్న డ్రైనేజీపై మ